## క్లుప్తంగా

### అడ్మిషన్లకు ఆహ్వానం

**దామెర:** మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని తెలంగాణా మైనారిటీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై. శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో 80 సీట్లకుగాను 51 సీట్లు ముస్లింలకు, మిగిలినవి ఇతరులకు కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా 6,7,8 తరగతులలో ముస్లిం విద్యార్థులకు లిమిటెడ్ బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ, ఎంఈసీ గ్రూలలో 40 సీట్లకు గాను 26 సీట్లు ముస్లింలకు మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయించినట్లు వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7995057981, 9963802350, 9989416061 నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం



**శాయంపేట:** మండలంలోని మందారిపేట గ్రామ స్టేజీ వద్ద ఉన్న దళితవాడలో తరచూగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. శాయంపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన కరెంట్ తీగలు చెట్లకు అల్లుకపోయి ఇలా జరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. నెల రోజులు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా కరెంట్ పోతున్న విద్యుత్ అధికారులకు సమాచారం అందించినప్పటికి పట్టించుకోవట్లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్య

సాక్షి ఎఫెక్ట్..

**నడికూడ:** మండలంలోని పలు గ్రామాలలో ఉన్న డంపింగ్ యార్డ్ నిర్మాణాల పగుళ్లపై సాక్షి దినపత్రికలో జనవరి 06న ప్రజాధనం పగుళ్ల పాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై శుక్రవారం వరంగల్ రూరల్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ శ్రీనివాస్ కుమార్ స్పందించారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌ను మండల పరిధిలోని డంపింగ్ యార్డ్‌ల పగుళ్లపై పూర్తి నివేదికతో పాటు, తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఆర్థికసాయం



**దామెర:** మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన బొగి అయిలయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సూర్యట్రస్ట్ చైర్మన్, గూడెప్పాడ్ ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, అయిలయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, అన్నా చేరాలు, మేడిపల్లి శ్రీకాంత్, టీఆర్‌ఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గజ్జి సూరయ్య తదితరులు ఉన్నారు.

### పరామర్శ

**నడికూడ:** మండలంలోని వరికోల్ గ్రామానికి చెందిన దోమకుంట్ల రాజయ్య, దొగ్గల రాయపోశాలు అలాగే రాయపర్తి గ్రామానికి చెందిన చంద్రకళ ఇటీవల వివిధ కారణలతో మృతి చెందారు. వారిని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

### చికిత్సపొందుతున్న రైతు మృతి

**పరకాల:** అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పరకాల మండలం మల్లక్‌పేట గ్రామానికి చెందిన రైతు రాసమల్ల సాంబయ్య(47) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాంబయ్య తన కూతురు పెళ్లిచేయటానికి, అకాల వర్షాలతో పంటనష్టం జరిగి దాదాపు రూ.8లక్షల వరకూ అప్పులు అయ్యాయి. అప్పటి నుంచి మనోవేదనకు గురయ్యేవాడు. గత నెల డిసెంబర్ 30 ఇంట్లో కుటుంబసభ్యులంతా నిద్రపోతుండగా క్రిమిసంహారక మందు తాగాడు. ప్రాణపాయ స్థితిలో ఉన్న సాంబయ్యను వరంగల్ ఎంజీఎంకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సాంబయ్య కొడుకు రాసమల్ల రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల పోలీసులు తెలిపారు.

# యాసంగిపైనే ఆశలు

- మండలంలో ప్రారంభమైన వరినాట్లు
- 11 వేల ఎకరాల్లో వరిసాగు అంచనా
- పెరుగుతున్న మొక్కజొన్న విస్తీర్ణం
- సాగుకు సరిపడా ఎరువులు సిద్ధం

**ఐనవోలు:** మండలంలో యాసంగి వరి సాగు పనులు ఊపందుకున్నాయి. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో పుష్కలమైన జలవనరులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. దీంతో యాసంగి పంటలు పండుతాయని దీమా కలుగుతోంది. ముఖ్యంగా చెరువులు, కుంటల కింద సాగుభూమి ఉన్న రైతులు వరి సాగు చేయడానికి సిద్ధపడుతుంటే, బోరు బావుల్లో నీటి లభ్యత ఉన్న రైతులు మొక్కజొన్న పంటను ప్రధానంగా ఎంచుకుంటున్నారు. వానాకాలంలో పత్తి సాగు చేసిన రైతులు పత్తి పంటను తొలగించి ఆ స్థానంలో మొక్కజొన్న, కూరగాయలు, పెసర, బొబ్బెర్లు, పల్లికాయ పంటలు వేయడానికి దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. నవంబర్‌లో చివరివారంలో వరినార్లు పోసుకున్న రైతులు వరినాట్లు వేసుకుంటుండగా, మరికొంత మంది రైతులు పొలం దున్నే పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

**పెరగనున్న సాగు విస్తీర్ణం**

మండలంలో 27వేల ఎకరాల సాగు భూమి ఉండగా యాసంగిలో సుమారు 11 వేల ఎకరాల్లో వరి, సుమారు 12వేల ఎకరాల్లో మొక్కజొన్న ప్రధానంగా సాగు చేస్తుండగా మిగతా విస్తీర్ణంలో కూరగాయలు, అపరాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**సాగుఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాలు**

గ్రామాల్లో వ్యవసాయ కూలీల సమస్యలను అధిగమించేందుకు, సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్‌ను వినియోగిస్తుండగా మరికొందరు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్నారు. ఈ పద్ధతుల్లో వరి సాగు చేస్తే సాధారణం కంటే 10 రోజుల ముందుగానే పంట చేతికి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పద్ధతిలో రెండుసార్లు కలుపుమందు వినియోగించాల్సి ఉంది.

**విత్తనాల కొరత**

మొక్కజొన్న సాగు గణనీయంగా పెరుగుతుండడంతో రైతులు సాగు చేయాలనుకున్న కంపెనీకి చెందిన నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు. దీంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేసి విత్తుకోవాల్సి వస్తోంది. విత్తనాల ధరలను ప్యాకెట్‌కు రూ.200 వరకు అధికంగా దుకాణదారులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అపరాలు, కూరగాయల సాగుపై ఆసక్తి**

పంటల సాగుకు నీరు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో పెసర, బొబ్బెర, పల్లికాయ, కూరగాయల సాగుకు కొంతమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే యాసంగి పంటలు చేతికి వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అందుబాటులో ఎరువులు**

యాసంగిలో రైతులకు అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, 20–20–013, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు



ఏపుగా ఎదిగిన మొక్కజొన్న

**యాసంగిలోనే అధిక దిగుబడులు**

వానాకాలంలో 3.5 ఎకరాల్లో వరి సాగుచేయగా పెట్టుబడి పోను తినడానికి సరిపోయేంత ధాన్యం వచ్చింది. పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. యాసంగిలో దొడ్డు ధాన్యం సాగు చేస్తే దిగుబడులు అధికంగా వస్తాయి. యాసంగి పంటకు ఎలాంటి సమస్యలు రాకపోతే పెట్టుబడులు పోను కొన్ని పైసలు చేతికొస్తాయి.

–బుర్ర రాజ్‌కుమార్, రైతు, లింగమోరిగూడెం

**జింక్‌సల్ఫేట్ తప్పనిసరిగా వాడాలి**

యాసంగిలో జింకుధాతు లోపం ఎక్కువగా వస్తుంది. అందుకు జింకు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. జీవన ఎరువుల వినియోగం పెంచుకోవాలి. భాస్వరం ఎరువులను తగ్గించుకోవాలి. నాటు వేశాక మూడు రోజుల లోగా గడ్డిమందు చల్లుకోవాలి. కాండం తొలుచు పురుగు నివారణకు నారుమళ్లలో కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లాలి. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

–అడప కవిత, ఏఓ, ఐనవోలు

### గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్పీఓ కల్పన

**భీమదేవరపల్లి:** గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్పీఓ కల్పన సూచించారు. మండలంలోని ముల్కనూర్ రైతువేదికలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాలకు చెందిన ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్‌లతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికిగానూ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఈ నెలఖారులోగా పూర్తిచేయాలన్నారు. త్వరితగతిన అభివృద్ధికి సంబంధించి పనులను గుర్తించి నివేదిక ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఇందులో ఎంపీఓలు నాగరాజు, రవి, విమల, ముల్కనూర్ పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్, డీపీఎం రాజు తదితరులున్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**కాజీపేట:** కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీ శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన పనులను లాంఛనంగా ప్రారంభించారు. కాలనీని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లోని గుడిసెల తొలగింపు

**పరకాల:** పరకాల వెల్లంపల్లి రోడ్డులోని 973 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన గుడిసెలను శుక్రవారం పోలీసులు తొలగించారు. సీపీఐ ఆధ్వర్యంలో హౌజింగ్ బోర్డు సంబంధిత ప్రభుత్వ భూమిలో గురువారం రాత్రి గుడిసెలు వేశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలతో మధ్యాహ్నం 2గంటలకు పోలీసులు అక్కడికి చేరుకుని గుడిసెలను తొలగించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తుందని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు అక్రమార్కులు చేతుల్లోకి వెళ్లకముందే పేదలకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు.



గుడిసెలు తొలగిస్తున్న పోలీసులు

## భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి





శాయంపేట: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



నడికూడలో..

**శాయంపేట:** రాష్ట్ర మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులను తక్షణమే చెల్లించి, వారికి సీఎం కేసీఆర్ రూ. 3వేల గౌరవ వేతనం అందిస్తామని ప్రకటించిన హామీని తక్షణమే అమలు చేయాలని భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాంమూర్తి డిమాండ్ చేశారు. అనంతరం మండల ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కిరాణా సామాన్లు, కోడిగుడ్ల ధరలు పెరిగినప్పటికి పాత ధరలనే ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయన్నారు. ఆ డబ్బులు కూడా సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బిల్లులను చెల్లించాలని, సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన వర్కర్లకు ప్రకటించిన రూ. 3వేలు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**

**నడికూడ:** మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించి, కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.సమ్మక్క, మండల అధ్యక్షురాలు రాధా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## ఇళ్లస్థలాలు కేటాయించే వరకూ భూపోరాటం

**ఎల్కతుర్తి:** పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేంత వరకు భూపోరాటం ఆగదని భూపోరాట కమిటీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బాషబోయిన సంతోష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సూరారం గ్రామ శివారులోని 566సర్వేనంబర్‌లో పేదలు ఆక్రమించుకున్న భూమిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపోరాటంలో మహిళలు సమన్వయం పాటిస్తూ ఐకమత్యంతో ముందుకు నడవాలని, అప్పుడే అనుకున్నది సాధ్యపడుతుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదలు ఆక్రమించుకున్న భూములకు పట్టాలు అందజేయాలని కోరారు. అలాగే సీఎం కేసీఆర్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు తండ మొండయ్య, కర్రె లక్ష్మణ్, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, మర్రిపల్లి తిరుమల, స్వామి, లలిత, చిరంజీవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాషబోయిన సంతోష్

## వైద్యరంగం ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

**భీమదేవరపల్లి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ బాధ్యులు రజిత డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఆశ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించి అనంతరం నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ వైద్యరంగాన్ని ప్రయివేటీకరణ చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కితీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇందులో ఆశ కార్యకర్తలు తాళ్లపల్లి కల్పన, గొర్రె పుష్ప, మాడ్గుల జ్యోతి, స్వరూప. ఎలిషా, గంగజమున, పద్మ, స్వరూప తదితరులున్నారు.



భీమదేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశలు

### నేషనల్ టెన్నికాయిట్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**శాయంపేట:** తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నేషనల్ పోటీలకు శాయంపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి నిషిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మోతే రాజకుమార్ తెలిపారు. సిద్దిపేటలో నేషనల్ గేమ్‌లో ఆడడానికి అవసరమైన కోచింగ్ క్యాంప్‌ను ఈనెల 7 నుంచి 25 వరకూ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విశాఖపట్టణంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

### నూతన కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ప్రకాశ్

**భీమదేవరపల్లి:** గ్రామాల్లో కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాశ్ అన్నారు. మండలంలోని ముల్కనూర్‌లో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చిన గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు.

### షిమ్లాకు రైలు సౌకర్యం కల్పించాలి

**హన్మకొండ:** రాష్ట్ర ప్రజల సౌకర్యార్థం వరంగల్ నుంచి షిమ్లాకు రైలు సౌకర్యం కల్పించాలని నమో నమో మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వెలిదె శివ డింగరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసినట్లు వెలిత శివ డింగరి తెలిపారు.

### సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ

**హసన్‌పర్తి:** సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని క్లబ్ జిల్లా లీడర్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ అజిత్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సీలింగ్ ఫ్యాన్, కుర్చీలను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్లబ్ కార్యదర్శి శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కృపాకర్, జోన్ చైర్మన్ గంగారపు రజనీకాంత్, జిల్లా లీడర్‌షిప్ సభ్యుడు చెన్నూరి శ్రీనివాస్, క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగమల్ల సుధీర్, గోనెల రాజేందర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



## చట్టాలపై బాలికలకు అవగాహన

**ఐనవోలు:** చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించి, సఖి-వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సఖి సెంటర్ అడ్మిన్ పెరువరం హైమావతి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో సఖి-వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. బాలికలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి ఇతర త్రా వేధింపులకు సంబంధించిన అంశాలను వివరించి పరిష్కారాలు సూచించారు. మహిళలు, బాలికల రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తోందన్నారు. సమస్యలు ఉన్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సాయం సఖి కేంద్రం ద్వారా అందిస్తామన్నారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఓ సునీత, కేస్ వర్కర్ వినీల సూపర్‌వైజర్‌లు సృజన, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సఖి సెంటర్ అడ్మిన్ పెరువరం హైమావతి

## విద్యుత్ సబ్సిడీలు వినియోగించుకోవాలి

**ధర్మసాగర్:** మండలంలోని గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ ప్రజలు విద్యుత్ సబ్సిడీలు వినియోగించుకోవాలని ఎన్పీడీసీఎల్ డివిజనల్ అధికారి సౌమ్య నాయక్ తెలిపారు. పలు గ్రామాలలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కులాలకు అధికారులు విద్యుత్ సబ్సిడీ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు చాలా సంవత్సరాల నుంచి విద్యుత్ సబ్సిడీ వినయోగించుకోలేక పోతున్నారని అన్నారు. విద్యుత్ సబ్సిడీల గురించి తెలియచేయడానికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ జీఓ కాపీ జిరాక్స్‌లు మండలంలో 500ల దాకా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ధర్మసాగర్ ఏఈ సుధాకర్, డివిజనల్ పరిధిలోని ఏడీఈలు, విజిలెన్స్ అధికారులు, ఏటీఎస్ అధికారులు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్సిడీ గురించి ప్రజలకు వివరిస్తున్న అధికారులు

## యూటీఎఫ్ సేవలు అభినందనీయం

**పరకాల:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని పరకాల మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవి అన్నారు. పరకాల ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ 2023 క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పరకాల మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవితో పాటు టీఎస్ యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ పరకాల మండల అధ్యక్షుడు మేరుగు ప్రసన్న మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు బదిలీ ప్రక్రియలు తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి తాటికొండ విశ్వనాథం, మండల బాధ్యులు కుమార స్వామి, రాజయ్య, బాబు, సారయ్య, సాంబయ్య, కృప, రాజు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

### ‘రోడ్డు మీద కూరగాయల వ్యాపారం చేయొద్దు’

**పరకాల:** పట్టణ పరిధిలో కూరగాయల మార్కెట్ రోడ్డులో ప్రజలకు అసౌకర్యంగా రోడ్డు మీద కూరగాయల వ్యాపారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేయడం జరిగిందని, మార్కింగ్ దాటకుండా కూరగాయల వ్యాపారం చేసుకోవాలన్నారు. నిబంధనలు ధిక్కరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదన్నారు.